# భార్యాలోలుడు

"నువ్వు పెద్దవాడివి. పదిమందికి నీతులు చెప్పవలసిన వాడివి. నువ్వే ఇట్లాచేస్తే ఎట్లా చెప్పు?" అని అడిగాడు క్రిష్ణయ్య రామ్మూర్తిని.

క్రిష్ణయ్య రామ్మూర్తి స్నేహితుడు. ఏదో పనిమీద వొచ్చినట్టు అదీ యిదీ మాట్లాడి, అసలు గ్రంథంలోకి దిగాడు.

రామ్మూర్తికి క్రిష్ణయ్యమాటలు అర్థంకాలేదు.కాని ఏదో సీరియస్‌గా సలహా చెప్పటానికి వొచ్చాడనే విషయం మాత్రం తెలిసింది.

"ఇప్పుడు నేనేంచేశాను? సరిగ్గా చెప్పు. లేకపోతే నాకు ఎట్లా తెలుస్తుంది?" అన్నాడు.

క్రిష్ణయ్య కొంచెంసేపు తటపటాయించాడు. తాను చెప్పతలచింది ఎట్లా మొదలుపెట్టాలా అని ఆలోచించాడు. ఇలా అన్నాడు— "నీ భార్య మంచిదే అవ్వొచ్చు. నేను కాదనను.కాని నువ్వు మాత్రం కొంచెం మంచీ చెడ్డా ఆలోచించుకోనక్కర్లా? ఆమె చెప్పిందంతా నమ్మటమే!" అన్నాడు.

"అసలు సంగతేమిటో చెప్పవోయ్—నానుడు బేరంతో చంపకా" అన్నాడు రామ్మూర్తి

రామ్మూర్తికి క్రిష్ణయ్య చెప్పదలచింది చూచాయగా తెలిసినట్లుంది.

"నువ్వు నీ భార్య చెప్పినమాటలు విని, నీ చుట్టాలందరితోనూ పోట్లాడుతున్నావటగా! అదేమంత మంచిపని చెప్పు? ఎవరికన్నా తెలిస్తే ఏమనుకుంటారు?" అని అడిగాడు.

రామ్మూర్తి ఒక్కక్షణం ఏమీ మాట్లాడలేదు—"ఈ సంగతి నీకు ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"నా భార్య చెప్పింది."

)o............o(